క్లుప్తంగా

ముగిసిన కుల గణన సర్వే

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుల గణన సర్వే ఆదివారంతో ముగిసింది. ఉదయం నుంచి తెనాలి పట్టణంలోని అన్ని వార్డులలో వార్డు వలంటీర్లు, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు ప్రతి ఇంటికి వెళ్లి.. వివరాలు నమోదు చేసుకున్నారు. బయోమెట్రిక్ వేయించారు.

వాసవి కుటుంబ సురక్ష సాయం పంపిణీ



తెనాలి: వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వీ 217ఏ జిల్లా పరిధిలోని 60 మంది వాసవి కుటుంబ సురక్ష లబ్ధిదారులకు రూ.30 లక్షలను ఆదివారం అందజేశారు. దివంగతులైన క్లబ్ సభ్యుల కుటుంబాలకు రెండో విడతగా ఈ ఆర్థిక సాయాన్ని క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ గోనుగుంట్ల జయంత్ కుమార్ అందజేశారు. స్థానిక గీతా మందిరంలో ఏర్పాటైన సభలో జయంత్‌కుమార్ మాట్లాడుతూ 2011లో క్లబ్ సభ్యుల సంక్షేమార్థం వాసవి కుటుంబ సురక్ష పథకం ప్రవేశపెట్టినట్లు గుర్తుచేశారు. ఇప్పటి వరకు ఈ పథకం కింద రూ.50 కోట్లను సంబంధిత కుటుంబాలకు అందజేశామని తెలిపారు. ఎం.సుబ్బారావు, కె.కల్యాణి, ఎ.మురళి, సీహెచ్ రామమోహనరావు, శ్రీనివాసరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలి



తెనాలిటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్ రాయుడు పేర్కొన్నారు. వికసిత్ భారత్ కార్యక్రమం ఆదివారం పట్టణంలోని మార్కెట్ సెంటర్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు, మున్సిపల్ డీఈ నాగభూషణం పాల్గొని, వికసిత్ భారత్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సూజర్‌వైజర్ సౌజన్య, బీజేపీ నాయకులు గాజుల వెంకయ్యనాయుడు, కన్నెగంటి ప్రశాంతి, బిట్రా కనకదుర్గ, మైలా హరికృష్ణ, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ కార్యవర్గ నిర్ణయం మేరకు పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ మూడు దశల పోరాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. నరసింహారెడ్డి, కె.కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లంతా పాల్గొనాలని వారు కోరారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పట్నంబజారు: మహిళ అదృశ్యంపై కేసు నమోదు అయింది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో నివాసం ఉండే రావి రమ చీటీ పాటలు నిర్వహిస్తూ ఉంటారు. ఈ క్రమంలో నష్టాలు రావడంతో గుంటూరు ఏటీ అగ్రహారంలోని శ్వేత ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే కుమార్తె రావి సాహితి దగ్గరకు కొద్ది రోజుల కిందట వచ్చారు. ఈ నెల 21న రమను సాహితి తిరిగి ఊరు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌లో దింపి వెళ్లిపోయారు. అనంతరం కొద్ది సేపటి తరువాత రైలు ఎక్కిందా.. లేదా ? అని తెలుసుకునేందుకు సాహితి తల్లికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువుల నివాసాల్లో అడిగినప్పటికీ రాలేదని తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలను దూషించిన ఘటనపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో సివిల్ కాంట్రాక్టర్ ఇంటికి వెళ్లి ఇద్దరు వ్యక్తులు మహిళలను దూషించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కె.మహేశ్వరరెడ్డి సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ప్రశాంత్, అతని తండ్రి వెంకటేశ్వర్లు మహేశ్వరరెడ్డి వద్ద లేబర్ వర్క్ చేశారు. ఈ నేపథ్యంలో వారి మధ్య లావాదేవీల విషయంలో గొడవ జరిగింది.
ప్రశాంత్, వెంకటేశ్వర్లు మహేశ్వరరెడ్డికి ఫోన్ చేసి దుర్భాషలాడారు. పైగా మహేశ్వరరెడ్డి ఇంటికి వెళ్లి మహిళలను అసభ్యకరంగా దూషించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్కారు బడిలో.. కార్పొరేట్ ఒరవడి

- పాఠశాలల రూపురేఖలు మార్చిన 'మనబడి నాడు–నేడు'
- రూ.28కోట్ల ఖర్చుతో 32 పాఠశాలల ఆధునీకరణ
- ఆధునిక హంగులతో వల్లభాపురంలో పాఠశాలల అభివృద్ధి



నాడు అధ్వానంగా వల్లభాపురం ప్రాథమిక పాఠశాల(ఎల్ఈ)



నేడు మారిన వల్లభాపురం ప్రాథమిక పాఠశాల(ఎల్ఈ)



కొల్లిపర: చదువే పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి. చదువే..తనను తాను రక్షించుకుని, కుటుంబ స్థితిగతులను మార్చే శక్తి ఇవ్వగలదు. అలాంటి విద్యను పేద, బడుగు, బలహీన వర్గాలకు చేరువ చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కంకణం కట్టుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు కల్పించడానికి మనబడి నాడు–నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నేడు ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారు. ప్రతి పాఠశాలలో డిజిటల్ విద్య అందుబాటులోకి తెచ్చారు. కార్పొరేట్ పాఠశాలలను మించిన సౌకర్యాలు కల్పించారు. ఆహ్లాదకరంగా తరగతి గదులు.. విశాలమైన ఆట స్థలాలను తీర్చిదిద్దారు. వల్లభాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలను రూ.43లక్షలు, ప్రాథమిక పాఠశాల(ఎల్ఈ) రూ.16 లక్షలతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. మండలంలో మిగిలిన సుమారు 30 పాఠశాలలను రూ.28 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తి అవుతుండగా, మరి కొన్ని పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు.

మా బడి మారింది



మా బడి ఒకప్పుడు పడిపోయేలా ఉండేది. ఇప్పుడు బాగుచేసి సుందరంగా తీర్చిదిద్దారు. అన్ని సౌకర్యాలు కల్పించారు. తరగతి గదులు ఇంకా బాగున్నాయి. పాఠశాలకు రావడం మానేయడం..మానేశాం.

– వి.నిఖిల్, 5వ తరగతి, ఎంపీపీ పాఠశాల, వల్లభాపురం

డిజిటల్ తరగతులు



గతంలో రెండు సబ్జెక్ట్‌లను ఒక ఉపాధ్యాయుడే బోధించే వారు. నేడు ప్రతి సబ్జెక్ట్‌కూ ఉపాధ్యాయుడు ఉన్నారు. డిజిటల్ విద్యను అందిస్తున్నారు. మాకు అర్థమయ్యే రీతిలో పాఠాలు చెప్తున్నారు.

– ఆర్.రేవతి, 8వ తరగతి, జెడ్పీ ఉన్నత పాఠశాల, వల్లభాపురం



వల్లభాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణ



ఆధునిక హంగులతో తరగతి గది..



నూతనంగా ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు

ఉత్తమ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు

తెనాలిటౌన్: కంచర్లపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన చాగంటి శ్రీనివాసరావు సంతాప సభ జై భీమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సభలో శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జై భీమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు కోవెలపు దేవానంద్ మాట్లాడుతూ 2018లో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును శ్రీనివాసరావు అందుకున్నారని తెలిపారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను బోధించారని, ఆయన మరణం గ్రామానికి, విద్యార్థులకు తీరని లోటు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి రామారావు, నందివెలుగు నాగమల్లేశ్వరరావు, చుక్కపల్లి వెంకటేశ్వరరావు, తులసి, కోటిబాబు, తాల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేల విరాళం

తెనాలి: వాకర్స్ క్లబ్ అభివృద్ధి కోసం క్లబ్ సభ్యుడు దొడ్డపనేని అచ్చయ్య ప్రకటించిన రూ.50 వేల విరాళాన్ని క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నకు ఆదివారం అందజేశారు. దొడ్డపనేని అచ్చయ్య సేవ, వితరణ దృక్పథాన్ని వెంకటరత్నం అభినందించారు. క్లబ్ సభ్యులు రత్తయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు పాస్టర్స్ అసోసియేషన్ సమావేశం

తెనాలిరూరల్: ది తెనాలి యునైటెడ్ పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ అసోసియేషన్ జనవరి నెల సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇస్లాం పేటలోని కృష్ణబలిజ కమ్యూనిటీ హాలులో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ పినపాటి జాన్‌పాల్ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. అసోసియేషన్ నాయకులు, పట్టణంలోని పాస్టర్లందరూ పాల్గొనాలని బ్రదర్ ఆనంద్ కోరారు.

యువతకు ఆదర్శం సీఎం వైఎస్ జగన్

యువజన విభాగం ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే శివకుమార్



యువజన విభాగం అధ్యక్షుడిగా కుర్రా జస్వంత్, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం

తెనాలి: యువత రాజకీయాల్లోకి వస్తే ప్రజలకు ఎంతగానో మేలు చేయొచ్చని చేసి చూపించిన ఏకైక యువ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. 2014లో ఓటమికి నిరాశపడకుండా 2019ఎన్నికల్లో 151 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుని, మళ్లీ ఇప్పుడు వై నాట్ 175 అంటూ ఎన్నికల సమర శంఖం పూరించిన ఆయన యువతకు ఆదర్శమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి రూరల్ మండల యువజన విభాగం కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం రాత్రి స్థానిక ఏ 1 ఫంక్షన్ హాలులో అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సమక్షంలో పోతావఝుల పురుషోత్తమశర్మ, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు కుర్రా జస్వంత్, ఇతర పాలకవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. సభలో శివకుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, యుక్త వయసు నుంచి రాజకీయాల్లో కొనసాగిన వారిలో తానూ ఒకడినని గుర్తుచేశారు. యువజన విభాగంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో యువతకు చక్కని వేదికనిచ్చామని, సమర్థతను నిరూపించుకోవాలని నూతన కమిటీకి సూచించారు. రాజకీయాల్లో కొత్త ఒరవడి తీసుకురావాలని చెప్పారు. నియోజకవర్గంలో 85 శాతం కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ లబ్ధిని అందించిందని గుర్తుచేస్తూ, ప్రభుత్వం చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. యువతను చైతన్యవంతులను చేయాలన్నారు. యువజన విభాగానికి తాను అండగా ఉంటానని హామీనిచ్చారు. జిల్లాలోనే తొలి కమిటీగా ప్రమాణం చేసిన రూరల్ మండల కమిటీ, రేపటి ఎన్నికల్లోనూ బాక్సులు బద్దలయేలా విజయభేరి వినిపించేందుకు కృషిచేయాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కల్లం హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ చిచ్చరపిడుగుల్లాంటి యువజన విభాగం రూరల్ మండల కమిటీని ఇచ్చిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల రంగంలో దుష్టచతుష్టయంతో పోరాడే అర్జునుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తోడుగా అందరం సిద్ధంగా ఉందామని కోరారు. పార్టీ యువజన విభాగం రూరల్ మండలాధ్యక్షుడు కుర్రా జస్వంత్ మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి నిమిషం నియోజకవర్గంలో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని హామీనిచ్చారు. 'గెస్ట్ ఎమ్మెల్యేలు వద్దు... లోకల్ ఎమ్మెల్యేనే ముద్దు...ఉన్నదీ మేమే...వచ్చేదీ మేమే' నంటూ నినాదాలతో యువతను ఉర్రూతలూగించారు. ప్రధాన కార్యదర్శి పఠాన్ యాసిర్‌ఖాన్ మాట్లాడుతూ కమిటీలో 95 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను నియమించారని, ఊరూరా కమిటీలతో ఎన్నికల ప్రచారానికి వెళతామని చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు స్వాగతం పలికారు. తొలుత చినరావూరు పార్కు నుంచి వహాబ్‌చౌక్, మార్కెట్‌సెంటర్, శివాజీచౌక్ మీదుగా ఫంక్షన్‌హాలు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

యువజన విభాగం ప్రమాణ స్వీకారం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం తెనాలి రూరల్ మండల విభాగం అధ్యక్షుడిగా కుర్రా జస్వంత్, ఇతర పాలకవర్గం ఆదివారం సాయంత్రం స్థానిక ఏ1 ఫంక్షన్ హాలులో ప్రమాణం చేసింది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పార్టీ మండలాధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు సమక్షంలో పోతావఝుల పురుషోత్తమ శర్మ వీరిచేత ప్రమాణం చేయించారు. ఉపాధ్యక్షులుగా మల్లవరపు భరత్, షేక్ కరిముల్లా, ప్రధాన కార్యదర్శులుగా ఉన్నం ప్రణీత్, పఠాన్ యాసిర్‌ఖాన్, కోటా వినయ్‌కుమార్, తోకల సుధీర్, బత్తుల బాలగోపి, కార్యదర్శులుగా దేశబోయిన గోపిరాజు, చెంగలశెట్టి సాయినాథ్, కనపర్తి సందీప్, భీమవరపు మల్లికార్జునరావు, నీలా విజయ్, జ్యోతుల శివ, షేక్ అజ్గర్ అలీ, షేక్ అలిముద్దీన్, సంయుక్త కార్యదర్శులుగా యర్రమల్లి సురేష్, చావలి జగదీష్, కోపల్లె వంశీ, భోగ్యం సుబ్బారావు, తమ్మ హరినాథ్‌రెడ్డి, పిల్లి కళ్యాణ్‌రావు, కనపర్తి శశికుమార్, కుమ్మరి వెంకటరత్నం, చెన్నుబోయిన వెంగళరావు ప్రమాణస్వీకారం చేశారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి నన్నపనేని వెంకట్రావు కృషి



వెంకట్రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు, రాజకుమారి

తెనాలిఅర్బన్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మాజీ ఎమ్మెల్యే నన్నపనేని వెంకట్రావు చేసిన కృషి మరువరాదని మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి పేర్కొన్నారు. వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే నన్నపనేని వెంకట్రావు 44వ వర్ధంతిని కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ముందుగా అయితా నగర్‌లోని ఆయన సమాధి వద్ద పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అలాగే కళాశాలలో ఆయన విగ్రహానికి, అక్కడ ఏర్పాటు చేసిన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ తెనాలి పట్టణంలోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలను స్థాపించారని గుర్తుచేశారు. ఆయన కుమారుడు సుధాకర్ ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలను సస్థాపించి విద్యా సంస్థలను విస్తరించారని చెప్పారు. వెంకట్రావు ఆశయాలను అందరు ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, ఎన్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల సీఈఓ నన్నపనేని భాస్కర్, భాగ్యలక్ష్మి, సుగుణ, ముకుందరావు, నిరంజన్ రావు, కళాశాల కమిటీ సభ్యులు మారౌతు సీతారామయ్య, ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపల్ నరసింహమూర్తి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రోటరీ క్లబ్ ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానం



అవార్డు గ్రహీతలతో అతిథులు

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం వొకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు–2024 ప్రదానోత్సవం ఆదివారం రాత్రి అట్టహాసంగా జరిగింది. సభకు క్లబ్ చైర్మన్ పావులూరి రాంబాబు అధ్యక్షత వహించారు. రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ టి.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సామాజిక సేవలో కొనసాగుతున్న రోటరీక్లబ్ సమాజం నుంచి మరింతమందిని ప్రోత్సహించాలనే భావనతో వివిధ రంగాల్లో ఉత్తమంగా కృషిచేస్తున్నవారిని ఎక్సలెన్సీ అవార్డులతో సత్కరిస్తున్నట్లు చెప్పారు. ఆ క్రమంలో 2024 సంవత్సరానికి పలువురిని సత్కరించటం ముదావహమన్నారు. రోటరీ క్లబ్ సేవలను ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి, కోళ్ల సింగారావు ప్రశంసించారు. అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం చేస్తున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా చెప్పారు. వివిధ రంగాల్లోని ప్రముఖులు సీహెచ్ శారదాదేవి (వైద్యం), ఎం.సురేంద్ర (మున్సిపల్), టి.శేషగిరిరావు (పాత్రికేయం), వి.కృష్ణయ్య (పోస్టల్), ఎస్.శారద (బ్యాంకింగ్), యర్రు బాపారావు (ప్రకృతి సేద్యం), ఎస్.రవీంద్రరెడ్డి (ఆర్టీసీ), టి.వెంకటేశ్వరరావు (న్యాయవాది), ఏవీఎల్ సంపత్‌రాయుడు (ఆటోమొబైల్), ఎస్.సాంబయ్య (టీఎస్‌టీయూసీ), వి.శ్రీనివాసరావు (పోలీస్), షేక్ ఇనయతుల్లా (సామాజికసేవ), సీహెచ్ శివపార్వతి, పి.విజయలక్ష్మి (కళారంగం), పి.వెంకటేశ్వరరావు (క్రీడలు)కు రోటరీ ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేసి సత్కరించారు. క్లబ్ కార్యదర్శి ఎన్.వెంకటేశ్వరరావు, కోశాధికారి కేఎల్ జగదీశ్వరాంబ, మాజీ అధ్యక్షులు గుత్తా వెంకటరత్నం, ఈదర వెంకట పూర్ణచంద్, సభ్యులు పాల్గొన్నారు.

మానవత సంస్థ సేవలు ప్రోత్సాహకరం



డాక్టర్ బాబు, మల్లేశ్వరరావు, రామకృష్ణకు సత్కారం

తెనాలి: మానవత సంస్థ అచిర కాలంలోనే ప్రజల మన్ననలను పొందటం ప్రోత్సాహకరంగా ఉందని రీజనల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం అన్నారు. సంస్థ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి లైబ్రరీ హాలులో జరిగింది. తెనాలి శాఖ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి కొత్త సుబ్రహ్మణ్యం తన ప్రసంగంలో సంస్థ తరపున సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ, రకరకాల సేవలు, వృత్తులతో సమాజంలో తమదైన ముద్రవేసుకున్న ప్రముఖులను సత్కరించటం స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. ప్రవాస భారతీయుడు, సమాజ సేవకుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి, ప్రముఖ శిల్పకారులు అక్కల రామకృష్ణ, సహజ కవి డాక్టర్ అయినాల మల్లేశ్వరరావును సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వై.రోహిణి, కొత్త సుబ్రహ్మణ్యం, పరిమి శ్రీనివాస్ ఇచ్చిన రూ.10,500లను కుసుమ అనే మహిళకు కుట్టుమిషను కొనుగోలు నిమిత్తం అందజేశారు. డాక్టర్ రామ్‌చంద్ తన ప్రసంగంలో జనవరిలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ కె.కళ్యాణి, కార్యదర్శి తన్నీరు శ్రీనివాసబాబు, ఉపాధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్, కోశాధికారి వెంకట్, డాక్టర్ జి.నాగేశ్వరరావు, మొవ్వా సత్యనారాయణ, పావులూరి శ్రీనివాసరావు, ఆలపాటి వెంకట్రామయ్య, షేక్ అబ్దుల్ హకీంజాని, జొన్నాదుల నరసింహారావు మాట్లాడారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

మంగళగిరి: నగర పరిధిలోని కాజ(వెంకటరెడ్డి పాలెం) జాతీయ రహదారిపై కారు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. వెంకటరెడ్డి పాలెంకు చెందిన కాపా సుబ్బారావు(70) ఆదివారం రోడ్డు దాటుతుండగా గుంటూరు నుంచి విజయవాడ వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టడంతో సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ప్రమాద వివరాలు సేకరించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాయామానికి సమయం కేటాయించండి



తెనాలిఅర్బన్: విద్యార్థులు చదువుకే పరిమితమై శారీరక శ్రమకు దూరమవుతున్నారని, దీంతో వ్యాధుల బారిన పడుతున్నారని జేఎంజే కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ పేర్కొన్నారు. తెనాలి స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో జేఎంజే కళాశాలలో ఆదివారం ఏరోబిక్స్, జుంబాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలని సూచించారు. ఎమ్మెల్యే పీఏ సునీల్ మాట్లాడుతూ ఏఎస్ఎన్ ఇండోర్ స్టేడియంలో ఏరోబిక్స్, జుంబాపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోచ్ శ్రీకాంత్, కమిటీ సభ్యులు రాజేంద్ర కుమార్‌రెడ్డి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అచ్యుత సాంబశివరావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

కొలకలూరు తెలుగు బాప్టిస్టు చర్చి నూతన కార్యవర్గం ఎంపిక



చర్చి నూతన కమిటీ సభ్యులు

తెనాలిటౌన్: కొలకలూరులోని తెలుగు బాప్టిస్టు చర్చి నూతన కార్యవర్గ కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. సంఘ కాపరి పాస్టర్ నన్నెపాగ సురేష్ అధ్యక్షతన సంఘ పెద్దల సమావేశం జరిగింది. చర్చి నూతన అధ్యక్షుడిగా కొలకలూరి మోషె, గౌరవాధ్యక్షులుగా కొలకలూరి నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా సుద్దపల్లి రవి, సెక్రటరీగా పొన్నెకంటి రమేష్, కోశాధికారిగా బీసిపోగు బాబు, ఉప కోశాధికారిగా ఆరంబాక నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా మంచికలపూడి జెర్మియాలను ఎన్నుకున్నట్లు పాస్టర్ సురేష్ తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులుగా కొలకలూరి సత్యానందకుమార్, మోదుకూరు దావీదు, కూచిపూడి మోహనరావు, గాజులవర్తి బసవయ్య, మంచికలపూడి ప్రసాద్, పొన్నెకంటి పాములు, లాజరు, గాజులవర్తి జింబో, కొలకలూరి నాగరాజులను ఎన్నుకున్నట్లు చెప్పారు. చర్చి అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు కృషిచేయాలని పాస్టర్ సూచించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రెసిడెంట్, సెక్రటరీ, కోశాధికారి, సభ్యులను సత్కరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

తెనాలిఅర్బన్: స్థానిక మారీసు పేటలోని తాలుకా బ్రాంచ్ స్కూల్‌లో 1994–95 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. ఆనాటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం ఉన్నత స్థితిలో స్థిరపడిన వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని చిమటా ఆనంద్ మోహన్, పెదలంక వెంకటేశ్వరరావు, సురేష్, సునీల్, సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

■ ముగ్గురు జూదరుల అరెస్ట్

మంగళగిరి: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి పేకాటాడుతున్న ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకుని వీరి నుంచి రూ.17,300 నగదు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.